పత్రికాప్రకటన కాకినాడ, 1.12.2018

హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహనతో కూడిన అప్రమత్తత పాటిస్తూ, వ్యాధి ప్రభావిత ప్రజలకు సామాజిక, మానసిక బాసటగా నిలవాలని జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా కోరారు.

శనివారం ప్రపంచ ఎయిడ్స్ దినం పురస్కరించి జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా తమ క్యాంపు కార్యాలయంలో ఎయిడ్స్ ప్రభావిత కుటుంబాల చిన్నారులతో అల్పహార విందులో పాల్గొని వారికి అన్ని విధాలా అండగా ఉంటామని ధైర్యం నింపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ మానవాళికి ఉనికికి ముప్పుగా పరిణమించిన హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి పట్ల విస్తృత ఆవగాహన పెంపొందించేందుకు 1987 సంవత్సరం నుండి ప్రతి ఏటా డిశెంబరు 1వ తేదీని ప్రపంచ ఎయిడ్స్ దినంగా జరుపుకోవడం జరుగుతోందని, ఎయిడ్స్ ప్రభావిత ప్రజల చికిత్స, సేవలను కొరకు, వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు జాగురూకతను పెంచేందుకు ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు దోహదం చేస్తున్నాయన్నారు. జిల్లాలో ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో చేపట్టిన ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలు సత్ఫలితాలను అందిస్తున్నాయని, వ్యాధి నివారణ కార్యాచరణ అమలులో తూర్పు గోదావరి జిల్లా రాష్ట్రంలో 2వ స్థానంలోను, జాతీయ స్థాయిలో 6వ స్థానంలోను నిలిచిందన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న 7 సమగ్ర సలహా, పరిక్షా కేంద్రాలకు క్వాలిటీ మేనేజ్మెంట్ అంశంలో ఈ యేడు జాతీయ పురస్కారం లభించిందన్నారు. ఎయిడ్స్ అవగాహన, నియంత్రణ చర్యలతో పాటు వ్యాధి ప్రభావిత ప్రజలకు పలు సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 5,338 మందికి సామాజిక బధ్రతా పించన్లు, 6,800 మందికి అన్నపూర్ణ కార్డు ద్వారా 30 కేజీల ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అలాగే 200 మందికి ఒంటరి మహిళా పింఛన్లు, 300 మంది మహిళలకు ఎన్‌టిఆర్ గృహాలు కల్పించామన్నారు. హెచ్ఐవితో జీవిస్తున్న 1211 మంది చిన్నారులకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ పర్యవేక్షణలో ఉంచామని, తల్లిదండ్రులను కోల్పోయిన 398 అనాధబాలలకు వివిధ సంస్థల ద్వారా రక్షణ కల్పించామన్నారు. ప్రభుత్వ పరంగా చేపడుతున్న కార్యక్రమాలతో పాటు ప్రజలందరూ ఎయిడ్స్ వ్యాధి పీడిత ప్రజలకు సౌహార్ద్రత, ఆదరణ పంచి వారిలో ఆత్మవిశ్వాసం, ధైర్యం నింపాలని జిల్లా కలెక్టర్ కోరారు.

కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి, నగర మేయర్ సుంకర పావని కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తూ ఎయిడ్స్ రహిత సమాజం కొరకు సమిష్టిగా పోరాడదామని ప్రజలకు పిలుపు నిచ్చారు. ఎయిడ్స్ వ్యాధి ప్రభావిత ప్రజలను ఆదుకునేందుకు జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలను కొనియాడారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్-2 సిహెచ్.సత్తిబాబు, డిఎంహెచ్ఓ డా.టిఎస్ఆర్ మూర్తి, జడ్‌పి సిఈఓ విద్యాసాగర్, ఐసిడిఎస్ పిడి సుఖజీవన్‌బాబు, ఆర్ఎంసి ప్రిన్సిపాల్ డా.ఆర్.మహాలక్ష్మి, సమాచారశాఖ డిడి యం.ఫ్రాన్సిస్, ఒఎన్‌జిసి ప్రతినిధి అరవింద్ మార్వొలే, అడిషనల్ డిఎంహెచ్ఓ డా.యం.పవన్ కుమార్, నగర ప్రముఖులు పిల్లి సత్తిబాబు జిజిహెచ్ హెచ్‌డిఎస్ మెంబరు బొడ్డు వెంకటరమణ మూర్తి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

(సమాచార శాఖచే జారీ)